క్లుప్తంగా

అట్రాసిటీ కేసు పెట్టాల్సిందే
డీబీఎఫ్, మానవహక్కుల వేదిక, ఏఎస్‌ల డిమాండ్


మాట్లాడుతున్న వివిధ సంఘాల నేతలు

మనోహరాబాద్(తూప్రాన్): దప్పు కొట్టడం లేదని దళిత కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని డీబీఎఫ్, మానవ హక్కుల వేదిక, ఏఎస్‌లు ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు రోహిత్, అంబేద్కర్ విద్యార్థి సంఘం నాయకులు, హైకోర్టు న్యాయవాది దివాకర్, డీబీఎఫ్ నేత కల్పన, స్వామి, సంజీవ్, నర్సింహ మనోహరాబాద్ మండలం గౌతోజీగూడెంలో సాంఘిక బహిష్కరణకు గురైన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు కౌన్సెలింగ్ పేరుతో మూడు రోజులుగా కాలయాపన చేస్తూ కేసు నమోదు చేయడం లేదన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి


జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మనోహరాబాద్ మండలం కోనాయపల్లి(పీటీ)లో పర్యటించి పలు వీధులను పరిశీలించారు. ఇంటింటికి తిరిగి నీటి నిల్వలు లేకుండా చూడాలని, నీటిలో పురుగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీధులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా కృషి చేయాలని కార్యదర్శికి సూచించారు. వీరి వెంట ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

శాంతియుతంగా నిమజ్జనం చేయాలి
సీఐ జాన్‌రెడ్డి


మాట్లాడుతున్న సీఐ జాన్‌రెడ్డి

నర్సాపూర్: వినాయక నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను శాంతియుతంగా నిమజ్జనం చేయాలని సీఐ జాన్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. శాంతియుతంగా నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించాలని సూచించారు. పట్టణంలోని ముస్లిం మత పెద్దలతో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా చేపట్టే కార్యక్రమాలను ఈనెల 19న చేపట్టాలని సూచించగా వారు అంగీకరించారు. సమావేశంలోఎస్‌ఐ లింగం పాల్గొని మాట్లాడారు.

మాతాశిశు సంరక్షణకు చర్యలు
అల్లాదుర్గం సీడీపీఓ పద్మలత

పెద్దశంకరంపేట(మెదక్): మాతాశిశు సంక్షేమ సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు అల్లాదుర్గం సీడీపీఓ పద్మలత అన్నారు. గురువారం మండల పరిధిలోని రామోజీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పుష్పలత, ఐసీడీఎస్ సిబ్బంది వెంకట్, అంగన్‌వాడీ టీచర్ విజయనిర్మల తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్‌లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. గ్రామానికి చెందిన లింగయ్యకు 10 వేలు, ప్రవీణ్‌కు 9 వేలు, రమ్యకు 10వేలు, సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఈ సందర్భంగా బాధితులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షులు నారాయణరెడ్డి, మాజీ సర్పంచు రాజగోపాల్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

- బ్యాంకు, స్త్రీనిధి ద్వారా అర్హులందరికీ రుణాలు
- డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు

కౌడిపల్లి(నర్సాపూర్): జిల్లాలో డ్వాక్రా మహిళలకు ఈఏడాది డిసెంబర్ నాటికి రూ. 660 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ సీసీలు, వీఓఏలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలకు 2024– 25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు ద్వారా రూ 592 కోట్లు, స్త్రీనిధి ద్వారా రూ. 68.09 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో ఇప్పటికే బ్యాంకు ద్వారా 205 కోట్లు, స్త్రీనిధి ద్వారా రూ.15.18 కోట్ల రుణాలు ఇచ్చామని వివరించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి ద్వారా రూ. 100 కోట్లతో మైక్రో ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటు కోసం రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. 7 వేల మంది మహిళలు వ్యాపారాలు చేసుకునేందుకు గాను ప్రభుత్వం రుణాలు ఇస్తుందన్నారు. దీంతో పాటు పౌల్ట్రీ, పెరటి కోళ్ల పెంపకం, పిండిగిర్ని, కిరాణం షాపు, జనరిక్ మెడికల్ షాప్, ఎలక్ట్రిక్ ఆటో తదితర యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. దీంతో పాటు రూ. 50 వేల లోపు సువిధ, రూ. లక్షలోపు ప్రగతి, రూ. 2లక్షలలోపు అక్షయ, రూ. 2 లక్షలపైన సౌభాగ్య రుణాలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 2,300 మైక్రో యూనిట్లు మంజూరు చేశామన్నారు. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం లోన్ బీమా, ప్రమాద బీమా కల్పిస్తుందన్నారు. డిసెంబర్ నాటికి లక్ష్యం మేరకు రుణాల పంపిణీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఆర్‌ఎం గంగారం, డీపీఎం జాన్‌కెనెడీ, ఏపీఎం సంగమేశ్వర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు మమత, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ గురు మాధవానంద స్వామి


పూజా కార్యక్రమంలో మాధవానంద స్వామి

కొల్చారం(నర్సాపూర్): కామ, క్రోధాలను జయించి, భగవంతుని సేవలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరు సనాతన భారతీయ సాంప్రదాయాన్ని, ధర్మాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి పేర్కొన్నారు. రంగంపేటలోని ఆశ్రమంలో 40 రోజుల నుంచి మండల పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆశ్రమ ఆవరణలోని నాగదేవతకు నిత్య పాలాభిషేకం, గురువారం కుబేర పాశుపత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తోటి వారి పట్ల విశ్వాసాన్ని కలిగి ఉండాలని మాధవానంద పేర్కొన్నారు.

చీడపీడల పట్ల అప్రమత్తత


పంటలను పరిశీలిస్తున్న ఏఈఓ

చిన్నశంకరంపేట(మెదక్): అధిక వర్షాలతో పంట పొలాలల్లో చీడపీడలు అధికంగా సోకడానికి అవకాశం ఉందని నార్సింగి ఏఈఓ విజృంభణ తెలిపారు. గురువారం నార్సింగిలోని వరి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. రైతులు పంట పొలాల్లో నీటిని తొలగించి భూమి ఆరేల చర్యలు చేపట్టాలని కోరారు. అధిక నీటితో పంటకు పోషకాలు అందవని, కావున ఎకరానికి 25 కిలోల బూస్టర్‌డోస్, 15 కిలోల పోటాష్ వేయాలని సూచించారు. పురుగు పడితే వెంటనే హైడ్రోక్లోరైడ్ గుళికలు వేయాలన్నారు.నత్రజని వేయడం వాయిదా వేయాలని సూచించారు. పంటలకు ఎలాంటి పీడచీడలు కన్పించినా వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించి అవసరమైన మందులు వాడాలని కోరారు.

కస్తూర్బా పాఠశాలను సందర్శించిన ఆర్డీఓ


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి కాలనీ లోగల కస్తూర్బా బాలికల పాఠశాలను తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వడియారం శివారులోని పరిశ్రమల నిర్వాహకులను పిలిపించి బాలికల వసతి గృహానికి కిచెన్‌షెడ్డు నిర్మించి ఇవ్వాలని ఆర్డీఓ కోరారు. ఆయన వెంట చేగుంట తహశీల్దార్ నారాయణ, ఆర్‌ఐ నర్సింగ్ యాదవ్‌తో పాటు కస్తూర్బా సిబ్బంది ఉన్నారు.

సామూహిక కుంకుమార్చన



మండల కేంద్రమైన చేగుంటలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో గురువారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. గణనాథుడికి పూజలను జరిపారు.
-చేగుంట(తూప్రాన్)

గురుకుల విద్యార్థులకు ఉచిత వైద్యం



పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే నర్సాపూర్, వెల్దుర్తి గురుకుల పాఠశాల విద్యార్థులకు వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా వైద్యం అందించారు. మేడ్చల్‌లోని సీఎంఆర్ ఆస్పత్రిలో వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశామని ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. - తూప్రాన్

కొనసాగుతున్న క్రీడోత్సవాలు


ఖోఖో ఆడుతున్న బాలికలు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో క్రీడోత్సవాలు కొనసాగుతున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పోటీలో పలు మండలాల నుంచి అన్ని విభాగాలకు చెందిన 530 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా గురువారం ఖోఖో పోటీలు జరిగాయి. శుక్రవారం వాలీబాల్ పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు ఎస్‌జీఎఫ్ కన్వీనర్ నాగరాజు తెలిపారు. క్రీడాకారులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. పీడీలు నాగచందర్, కిరణ్, సిద్దిరాం, యాదగిరి, శోభ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి 40 మంది క్రీడాకారుల ఎంపిక

మెదక్‌జోన్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మెదక్ మండల స్థాయి అండర్ 14, అండర్ 17 బాల, బాలికలకు కబడ్డీ పోటీలను గురువారం బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన 40 మంది క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నీలకంఠం, హెచ్‌ఎంలు శంకరయ్య, నాగరాజు, పీడీలు మాధవరెడ్డి, శ్యామయ్య, దేవేందర్‌రెడ్డి, పీఈటీలు కుమార్, పోచయ్య పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఓటమి విజయానికి సోపానం

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మైనంపల్లి

పాపన్నపేట(మెదక్): ఓటమి రేపటి విజయానికి నాంది అని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. మండల కేంద్రమైన పాపన్నపేటలో గురువారం జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడల బహుమతి ప్రదాన ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆటల్లో ఓడిన విద్యార్థులు పట్టు వదలకుండా విజయం కోసం కృషి చేయాలని, ఎప్పుడు కూడా తమ లక్ష్యాన్ని మధ్యలో విడిచి పెట్టవద్దని సూచించారు. నిరంతర శ్రమతో సమాంతర రేఖలను కూడా కలుపొచ్చని చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకు ముందు అర్కెల గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని, పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో వడ్డించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జనార్దన్ రెడ్డి, విక్కి, వినోద, ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంతప్ప, ఆకుల శ్రీను, ఆవుల గోపాల్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి,గౌస్, డీలర్ శ్రీను, నరేందర్‌గౌడ్, నిరలక్షప్ప, రాంరెడ్డి, హెచ్‌ఎం మహేశ్వర్, టీచర్లు నాగరాజు, అంజాగౌడ్, పీఈటీలు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఉపాధ్యాయులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లి, రాజ్‌పేట, గాజిరెడ్డిపల్లి, సర్దన, కూచన్‌పల్లి గ్రామాల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి సుభాశ్‌రెడ్డి తెలిపారు. ఎస్జీటీ ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తుందని, గతంలో అనేక సమస్యలు పీఆర్టీయూ ఆధ్వర్యంలోనే పరిష్కరించామని గుర్తు చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు త్వరలోనే పాత పెన్షన్ విధానం వర్తింపచేసే వరకు పోరాడుతామని చెప్పారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా, రాష్ట్ర బాధ్యులు రాజేందర్‌రెడ్డి, సదారం, రఘుబాబు, సంగమేశ్వర్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో నంబర్లతో నేరాలకు చెక్

ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి



ఆటోకు నంబర్

కౌడిపల్లి(నర్సాపూర్): ఆటోలలో తిరుగుతూ చోరీలు, నేరాలకు పాల్పడకుండా ప్రతి ఆటోకు నంబర్లు వేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటోలకు సీరియల్ నంబర్, మండలం, జిల్లా కోడ్‌లు రాయించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఆటోలకు ఇరువైపుల నంబర్లు వేయడం వల్ల ఆటో వివరాలు తెలుస్తాయన్నారు. దీంతో ఆటోలలో తిరిగి చోరీలు, నేరాలు చేసిన వారిని సులభంగా పట్టుకోవచ్చన్నారు. ఆటోడ్రైవర్లకు సైతం భయం ఉంటుందని చెప్పారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట్ మండల కేంద్రంలో గురువారం ఆటోలకు నంబర్లను వేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆటో నాయకులతో, డ్రైవర్లతో మాట్లాడుతూ ప్రతి ఆటో, డ్రైవర్ వివరాలను నమోదు చేస్తున్నామని చెప్పారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తాగి వాహనాలు నడపవద్దని, మితిమీరిన వేగంతో ప్రయాణం చేయవద్దని సూచించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ బారిన పడకుండా పలు అంశాలపై అవగాహన కల్పించారు.

సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని శక్తి

- భారతీ సిమెంట్‌తో మెరుగైన భవన నిర్మాణం
- టెక్నికల్ మేనేజర్ కె.సునిల్


మాట్లాడుతున్న టెక్నికల్ మేనేజర్ సునిల్

మెదక్‌జోన్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న భారతీ సిమెంట్ వినియోగదారుల ప్రయోజనాల కోసం అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని టెక్నికల్ మేనేజర్ కె.సునిల్ తెలిపారు. మెదక్ పట్టణంలోని శ్రీరామలింగేశ్వర ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని 13 దేశాలలో భారతీ గ్రూప్ సిమెంట్ విస్తరించి ఉందన్నారు. తెలంగాణలో భారతీ అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌ను అందుబాటులో తెచ్చిందన్నారు. ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతీ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందని చెప్పారు. స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిల నిర్మాణ నాణ్యతను పెంపొందిస్తుందని చెప్పారు. సిమెంట్ వినియోగదారులకు అవసరమైతే ఉచిత సాంకేతిక సాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో తమ ఇంజనీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయం చేస్తారని వివరించారు. గృహనిర్మాణ రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో భారతీ మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ సతీష్ కుమార్, టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్, డీలర్ లింగమూర్తి పాల్గొన్నారు.

తపస్ అధ్యక్షుడిగా సిద్దిరాములు

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా సిద్దిరాములు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా పి సతీష్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, కిషన్, శోభారాణి, కార్యదర్శులుగా రాజు, భవానీ, సరితలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు వారు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సర్వే**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) 2020లో దరఖాస్తులు చేసుకున్న పాట్లను గురువారం సర్వే చేశామని ఎంపీఓ శరత్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చిట్కుల్‌కు చెందిన కమ్మరి వాణి, విట్ల సత్యనారాయణ గ్రామ శివారులో తమకున్న భూమిలో 2020 లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

◆ **నేడు ఎస్‌జీఎఫ్ జట్ల ఎంపిక**

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం అండర్–14, అండర్–17 విభాగాల్లో ఎస్‌జీఎఫ్ జట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఎంఈఓ యాదగిరి పేర్కొన్నారు.

◆ **ముగిసిన ఆటల పోటీలు**

కొల్చారం(నర్సాపూర్): ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా సాగుతున్న మండల స్థాయి ఆటల పోటీలు గురువారం ముగిశాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఎంఈఓ నీలకంఠం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మణ్, ఖాజా పాషా, నవీన్, రుక్మేశ్, స్వప్న, చందన, తదితరులు పాల్గొన్నారు.

◆ **వినాయక మండపం వద్ద అన్నదానం**

పాపన్నపేట(మెదక్): పాపన్నపేటలోని పోస్టాఫీస్ సమీపంలోని వినాయక మండపం వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత, రాజు చౌదరి, విగ్రహదాత శ్రీకాంత్, హనుమాత్ యూత్ సభ్యులు శ్రీరాందుర్గయ్య బేతయ్య, శివగౌడ్, విష్ణు, అజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

◆ **కార్యదర్శికి అదనపు బాధ్యతలు**

అల్లాదుర్గం(మెదక్): అధికారి బదిలీపై వెళితే మరో అధికారిని నియమిస్తారు. లేకుంటే అదే హోదాలో ఉన్న అధికారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తారు. అయితే.. మండల పంచాయతీ అధికారి బాధ్యతలను ఓ పంచాయతీ కార్యదర్శికి అప్పగించిన సంఘటన అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. అల్లాదుర్గం ఎంపీఓగా సయ్యద్ విధులు నిర్వహిస్తుండగా, రెండు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. అతని స్థానంలో పంచాయతీ కార్యదర్శికి ఎంపీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

◆ **బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం**

హవేళిఘణాపూర్(మెదక్): ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి మృతి చెందిన సురేష్‌నాయక్ కుటుంబీకులకు మెదక్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లి తండాకు చెందిన బాధిత కుటుంబానికి హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ మోహన్‌నాయక్ అండగా నిలిచారు. ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు, రూ.5వేల నగదును అందజేశారు.

◆ **మల్కాపూర్‌ను సందర్శించిన డీపీఓ**

తూప్రాన్: మండలంలోని ఆదర్శ గ్రామం మల్కాపూర్‌ను జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య గురువారం సందర్శించారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి అరుణ, మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

◆ **ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ కాపర్ చోరీ**

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేట శివారులోని రాయిన్‌చెరు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్‌తో పాటు కాపర్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. గురువారం ఉదయం వ్యవసాయ పొలాలకు వెళ్లిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయడం లేదని పరిశీలించగా.. ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్‌తో పాటు కాపర్‌ను దొంగిలించినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు.

◆ **బస్సు, కారు ఢీకొని ఒకరికి గాయాలు**

పెద్దశంకరంపేట(మెదక్): ఆర్టీసి బస్సు– కారు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పెద్దశంకరంపేటలో 161వ జాతీయ ప్రధాన రహదారి దర్గా వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. హైదరాబాద్ వైపు నుంచి పిట్లం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు పెద్దశంకరంపేట నుంచి కట్టెల వెంకటాపూర్ దర్గా వైపు వెళుతున్న కారును ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కారు నడిపిస్తున్న డాక్టర్ అజ్మీర్‌కు గాయాలయ్యాయి. అతడిని పేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బస్సులో ఉన్న కండక్టర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఏఎస్‌ఐ సునీత సంఘటన స్థలం వద్ద వివరాలు సేకరించారు.

◆ **పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు ఆరోగ్యం**

చిన్నశంకరంపేట(మెదక్): గర్భిణీలు పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని చిన్నశంకరంపేట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ తెలిపారు. గురువారం చిన్నశంకరంపేటలోని 1, 4వ అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారంపై అవగహన కల్పించారు. పోషక విలువలతో కూడిన కూరగాయలు, గుడ్లు, పప్పులు రోజువారి ఆహారంలో భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నాగమణి, జ్యోతి పాల్గొన్నారు.

◆ **దుర్గామాత ఆలయాన్ని పరిశీలించిన సీఐ**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి గ్రామంలోని దుర్గామాత ఆలయాన్ని రామాయంపేట సీఐ వెంకటరాజంగౌడ్ పరిశీలించారు. గురువారం ఆయన కొర్విపల్లి దుర్గమాత ఆలయం వద్ద పరిసరాలను పరిశీలించారు. చోరి జరిగిన విషయం గురించి ఆరా తీశారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని చెప్పారు. ఆయన వెంట ఎస్‌ఐ నారాయణగౌడ్ ఉన్నారు.

◆ **వెంకటాపూర్‌లో పోషణ మహోత్సవం**

టేక్మాల్ (మెదక్): గర్భిణీలు బాలింతలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సమయానికి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైలం తెలిపారు. పోషణ మాసంలో భాగంగా గురువారం టేక్మాల్ మండలం వెంకటాపూర్, సంగ్యాతండా, ఎల్లుపేట గ్రామాల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఇందులో డాక్టర్ షఫీ, ఏఎన్‌ఎం అనసూజ, అంగన్వాడీ యాదలక్ష్మీ, సరిత, వరలక్ష్మీ, దీప, శోభ, రేణుక, పాఠశాల హెచ్‌ఎం సింధూర ఉన్నారు.

◆ **ఘనంగా పోషన్ మాసోత్సవాలు**

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బ్యాతోల్ గ్రామంలో గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ్ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను గురించి వివరించారు. కార్యక్రమంలో వెంకటరమణ, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి, శశిరేఖ, కవిత, గుండమ్మ మహిళలు పాల్గొన్నారు.

◆ **గిరిజన మహిళ అదృశ్యం**


అంగోత్ శాంతి

నర్సాపూర్ రూరల్: కూరగాయలు అమ్మేందుకు నర్సాపూర్‌కు వచ్చిన గిరిజన మహిళ అదృశ్యమైనట్లు నర్సాపూర్ ఎస్సై లింగం తెలిపారు. మండలంలోని ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన అంగోత్‌శాంతి (45) కూరగాయలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. రోజులాగే ఈనెల 11న ఉదయం ఇంటి నుంచి నర్సాపూర్ మార్కెట్‌కు కూరగాయలు అమ్మేందుకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరింది. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో రాత్రి వరకు కుటుంబ సభ్యులు నర్సాపూర్‌తో పాటు పరిసర గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో గురువారం శాంతి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.